మన్మథ సందర్శనము

చాలాకాలంనుంచీ మన్మథుడి దర్శనం చేసుకోవాలని కుతూహలం వుండేది. అది నేటికి గాని సిద్ధించింది కాదు. ఎలా సిద్ధించిందో చెప్పడానికి వీలు లేదు. ఆవిషయాలు రహస్యంగా వుంచే షరతు మీాదనే కామదేవుడి దర్శనం నాకు లభించింది గనక ఆవిషయాలు వెల్లడి చేయడానికి వీలు లేదు.

వేటకు వెళ్ళడాని కని మన్మథుడు స్నేహితులతోనూ సహచరులతోనూ సిద్ధంగా వున్నాడు. ఆయన ఫలానా తావున వున్నా డని నిశ్చయించ లేకపోయినాను.

ఒకవైపున, చిగురుటాకుల పట్టము కట్టుకొని, సిందూరము బొట్టు పెట్టుకొని, తోయజప్రసూనాలు తోరణం కట్టుకొని, వనలక్ష్మితో న:స మాడుతున్నాడు వసంతరాయుడు.

చల్లని నీళ్ళల్లో జలకా లాడి, దేహంనిండా పుప్పొడి పూసుకొని, మేఘాల వెంబడి వేటాడ డానికి జింక బాబా నెక్కి సిద్ధంగా వున్నాడు వాయుదేవుడు.

ఇంకోచోట, నల్లటి గొడుగు వేసుకొని, తెల్లటి బట్టలు కట్టుకొని, అస్తమానం నవ్వుతూ, చక్కని చుక్కలతో సరసాలాడుతున్నాడు చందమామ. అతన్ని చూసే సరికి మతి పోతుంది.

మరోచోట విల్లు కనిపిస్తున్నది. ఎక్కుపెట్టిన వింటిలో బాణాలు అవుపిస్తున్నవి. కిలకిల లాడుతూ చిలకలూ, కోకిలలూ రెక్కలతో ఛామరలు వేస్తున్నవి. కళ్ళు మిరుమిట్లు గొలిపే అందం మూర్తిభవించిందా అనేలాగు తోచే సుందరాంగి—రతీదేవి కాబోలు—ఒక పక్కన కనిపిస్తున్నది. కామదేవుడు కనబడడం లేదు. అయినప్పటికీ, కొంచెం వూహించి ఆస్థలాన ఆయన వున్నట్లు నిశ్చయించుకొని సమీపించి ‘‘కామదేవా, నమస్కారము!’’ అన్నాను. నిత్యశోభనమస్తు!’’ అనే మాటలు వినబడ్డవి.

‘‘తమ రూప దర్శనం చేసుకోవడానికి నా కళ్లకు అనుజ్ఞ దయ చెయ్యరా!’’అన్నాను. అని వెంటనే చాలా నొచ్చుకొన్నాను. కామదేవుడికి జరిగిన పరాభవం జ్ఞప్తికి తేవడం తప్పు. మాట జారిపోయింది! నా ప్రశ్నకు సమాధానం రాలేదు.

‘‘తమ సౌభాగ్యం చూచి పోవడానికి ఎంతో శ్రమమీద ఇక్కడికి వచ్చాను’’ అన్నాను. అనే అనడం

తోనే—ఆయన ఆజ్ఞ పొందినాడు కాబోలు—వాయుదేవుడు నన్నెత్తుకొని పోయి కామదేవుని ఆయుధాగారంలో దింపినాడు.

ముల్లోకాలనూ అవలీలగా జయించిన మహాయోధ ఆయుధాలు అయిదే అని యిదివరలో నా వూహ. కాని అక్కడ చాలా రకాల పువ్వులూ, చిగుళ్ళూ, తులసి దళాలూ, దర్భలూ, మొగలిరేకులూ ఇంకా యేమేమో వున్నవి. అప్పుడు వాయుదేవుడి కేసి తిరిగి అడిగాను “అరవిందము, అశోకము, చూతము ఇత్యాది అయిదు బాణాలే కదా మన్మథునివి. ఇవన్నీ యెందుకు?”

వాయుదేవుడు నవ్వి యిలా అన్నాడు. “వెర్రివాడా, పూర్వ యుగాలలో ఆ బాణాలు వినియోగించేవాడు, స్వర్గలోకంలో ఇప్పటికీ ఆ అయిదే వినియోగిస్తాడు. కాని భూలోకాన కలికాలాన పరిస్థితులు మారడంచేత ఇన్నిరకాల బాణాలు కావలసి వచ్చింది. విన లేదా భూలోకంలో ప్రచారంలో వున్న ఈ పద్యం—

జవరాలి బొడగన్న సన్యాసిపై నేయు
తులసి లేజిగురాకుతూపు మరుడు;
వేదవిప్రుని గన్నవిధవపై ఝళిపించు
దర్భపల్లవహేతి దర్పకుండు;

కటకారకులకన్య గనిన హాళికుమీద
బొడుచు బూముని కోల పుష్పశరుడు;
నాడింధముని గన్ననాతిపై నేయును
నలరు జిచ్చరకోల నంగభవుడు;
బెరిసి వెన్నెల గాయంగ జేరకమ్మ
పులినతలముల నాయాయికోలము బెరిగి
దాల్చు శస్త్రాస్త్రములు జారదంపతులకు
నసమబాణుండు తిరుణాళ్ళ నన్నినాళ్ళు

"అయితే భూలోకంలో పరిస్థితులు మారడంవల్ల మన్మథుడికి పని యెక్కువయినట్టు తోస్తుంది. పూర్వయుగాలలో వసంతకాలంలో మాత్రం మన్మథుడికి పని వుండేది. అప్పుడయినా పర్వదినాలనీ, ఏకాదశులనీ ఇలాంటి సెలవుదినా లుండేవి. ఈయుగంలో అన్ని కాలాలలో అన్నిపూటలా చేతినిండా పనే. అందుచేతనే ఆయుధాలు హెచ్చు చేయవలసి వచ్చింది. ఆఫీసుకూడా వృద్ధి చేయవలసి వచ్చింది."

అంతట ఒకమూల మరతుపాకీ, పిస్తోళ్ళూ చూసి ఆశ్చర్యపడి అవి యెందు కని వాయుదేవుణ్ణి అడిగాను. ఆయన అన్నాడు: "చెప్పలేదా ఈకాలంలో అలాంటివి కావలసి వచ్చాయని? వింటినుంచి వదిలినబాణాలు కొందరిమీద పని చెయ్యవు. ఆలాటివాళ్ళను పిస్తోలుతో

వువ్వులు పెట్టి కొడతాడు. తిరునాళ్ళు జరిగేటప్పుడూ పెద్దపెద్దసభలలోనూ, పశ్చిమదేశవాసుల విందులలోనూ, కోటవిందులలోనూ తనకు కష్టం లేకుండా వుండేటందుకు సంఘంమీద ఒక్కసారిగా మరతుపాకీ ప్రయోగిస్తాడు. చాలాదూరాన వున్నలక్ష్యాన్ని కొట్టడానికి ప్రత్యేకంగా తుపాకులున్నవి. వాయువిమానాలలో వెళ్ళేపాశ్చాత్యులమీద ప్రయోగించడానికి మాత్రం అవి ఉపకరిస్తవి."

"అయితేఇంతపనీ ఒక్కమన్మథుడే చేసుకోగలడా?"

"ఆయనకు లోటేమిటి? ఎంతసిబ్బంది వున్నది! అందరూ ఆయనకు సహాయం వస్తారు. చంద్రుడిబాణాలుమట్టుకు మతిసంచలనంమాత్రం చేస్తవి. చూడుమన్మథుడిపద్దులు!" అని నాకు వాయుదేవుడు పద్దులు చూపినాడు. ఆయన దినచర్యా మాసచర్యా, సర్వమూ అక్కడ వ్రాసి వున్నవి. ఆలెక్కలు సంవత్సరాంతానికి విష్ణుమహేశ్వరులకు వెళ్ళవలె. ఒకనకలు బ్రహ్మదేవుడికి కూడా పంపినట్టు ఉదహరించి వున్నది. సృష్టిస్థితిలయాలు ఒక్కతాకీగా జరుగుతూ వుండడానికి ఈలెక్కలు త్రిమూర్తులకూ అవసరమని తోచింది. వాయుదేవుడు తొందరచేస్తూవున్నా ఏదేశంలో ఎక్కువబాణాలు వినియోగపడ్డవో వినోదం తెలుసుకోవలె

నని పద్దులు తిప్పి చూచాను. మొదట ఫ్రాంసు, తర్వాత ఇంగ్లండు—ఇలా వున్నవి. మన హిందూదేశము ఏచివర సంఖ్యలలోనో కనబడ్డది.

"అయితే మన్మథుడు ఎక్కడ తరుచుగా వర్తిస్తూ వుంటాడు?" అన్నాను.

"నీవూహా యేమి?"

"అల్పజ్ఞుణ్ని. నాకు తెలియదు. అయినా మాలోకంలో అనుకోవడం మాత్రం ఇది—

సంధివిగ్రహయానాది సంఘటనల
బంధకీ జారులకు రాయబారి యగుచు
పట్టణంబున నిత్యంబు పవలు రేలు
పూటకూటింట వర్తించు బుష్పశరుడు.

మరిన్నీ మన్మథ కూటమే వేశ్యావాటిక అని తలుస్తారు."

"ఆమాత్ర మయితే బాగానే వున్నది. ఇప్పుడు ఆయన వర్తించని ప్రదేశమేలేదు. అందులో ముఖ్యంగా సముద్రతీరాలు, ఉద్యానవనాలు, ఉత్సవాలు, జూదపు కొంపలు, మద్యపుదుకాణాలు, ఓడలు, రైలు బళ్ళు, వాయు విమానాలు. ఇంకో చిత్రం. ఇప్పుడు మన్మథుడు తన బాణాలు టెలిగ్రాఫు తీగెలలో నుంచీ, టెలిఫోను తీగెలలోనుంచీ పంపవలసి వస్తున్నది."

“అయితే మాలోకంలో పోస్టాఫీసు ఉద్యోగస్థులకు వలె మన్మథుడికి సెలవులు లేనట్టు తోస్తుంది.”

“అలాగే. ఇక వేటకు వేళ అయింది. వెళుదాము రా!” అని నన్నెత్తుకు పోయి యథాస్థానం చేర్చాడు వాయుదేవుడు.

అందరూ వేటకు సన్నద్ధులై బయలు దేరారు. ఈ తమాషాకూడా కొంచెం చూతామని నేనూ వెనక బయలు దేరాను. ఎప్పుడు చేరామో ఎలా చేరామో నాకు తెలియదు. కాని రెప్పపాటుకాలంలో మేమంతా భూలోకంలో వున్నట్టు గ్రహించాము.

మధ్యాహ్నం మొదలు మళ్లీ తెల్లవారేదాకా మన్మథుడు ఆడినవేట వర్ణించడానికి భారత మంత గ్రంథం అవుతుంది. అందులో కొన్ని ముఖ్యమైన సంగతులుమాత్రం చెప్పి మిగిలినవి ఊహకు వదలుతాను.

వేటాడడంలో సాంప్రదాయం సాధారణంగా బాణానికి సులభంగా లొంగే జంతువుల జోలికి వేటకాడు వెళ్ళకపోవడము. అందు చేతనే పందిని వేటాడడమన్నా జింకను వేటాడడమన్నా చెవి కోసుకొంటారు. కాని మన్మథుడి సాంప్రదాయం ఇది కాదు. ఎవరు బాణాలకు త్వరగా చిక్కుతారో వారిమీదే బాగా బాణాలు ప్రయోగిస్తాడు. ఇందుకు తార్కాణం

పరానుదేశపుస్త్రీలు బాణము చూడడంతోనే గడగడా వణుకుతారు. వింట సంధించి బాణాలతో కొట్టను వారిని మన్మథుడు; చేతితో పువ్వులు విలాసంగా విసురుతాడు. అప్పుడు వాళ్ళు పడేక్షోభ చెప్పడానికి అలవి కాదు! కాఫీక్లబ్బులకు పరుగెత్తేవాళ్ళూ, నాటకశాలలకు పరుగు లెత్తేవారూ, తోటలకు పరుగు లెత్తేవారూ, పరదేశాలకు పరుగు లెత్తేవారూ! పరానుదేశపు పురుషులమీద మన్మథుడు ఆట్టేబాణాలు వెయ్యలేదు; పిస్తోలులో పెట్టి కొట్టేవాడు. ఇంగ్లీషుయువతులుకూడా పరానుయువతుల చెల్లెళ్ళే ఈవిషయంలో.

మదరాసు సముద్రతీరం దగ్గిర విశేషాలు చెపుతాను. ఒక అయ్యరు గూడకట్టు కట్టుకొని అలా వెళ్తున్నాడు. పిస్తోలులో పెట్టి మన్మథుడు ఒక్క పువ్వు వేల్చినాడు. వింటినుంచి వదిలిన పువ్వులు అయ్యర్లమీద పని చెయ్యవట. పేల్చినా ఆపువ్వును అతను దులిపేసుకొని వెళ్ళిపోవడం మొదలు పెట్టినాడు. నా కాశ్చర్యమయింది. వాయుదేవుణ్ణి అడిగినమీదట దాని యథార్థకారణం తెలిసింది. బుద్ధి కొంచెమైనా మన్మథముఖమై వుంటేనే కాని బాణాలు పనిచెయ్యవు. ధనకాంతుగల అయ్యర్లమీద పిస్తోలుదెబ్బ పడకపోవడానికి కారణం అది. మోతుకాంతు వున్నవారి మీదకూడా

పనిచెయ్యవట. కాని మన్మథుడు అలాంటి వాళ్ళ విషయంలో సూటిగా వున్న మొగలిరేకులు వింటి కను సంధించి కొడతాడు. అప్పుడు ఎవ్వరూ లొంగకుండా వుండలేరు.

మన్మథుడు ఒకకొంటెతనం చేసేవా డిక్కడ. దాక్షిణాత్య వైష్ణవవధూటులవెనక పొంచుండి సాధారణంగా బాణాలు వేసేవాడు. అటువంటి బాణాలు గురితప్పకుండా వెళ్ళి అమోఘంగా పని చేస్తవి.

బొంబాయి సముద్రతీరం దగ్గిర ఒకవింత జరిగింది. ఒకనవనాగరీకుడు ఒకఇంగ్లీషు యువతితో కలిసి షికారు వచ్చాడు. మన్మథుడు అతనిమీద ఒకబాణం వేసి ఇంకోబాణం ఆవిడ మీద విసిరినాడు. ఆనాగరీకుడి ఓవర్కోటు తక్షణం కింద రాలింది. యువతి ఆకోటు మీద మూర్ఛపోయింది!

మన్మథబాణాలు రకరకాల మనుష్యులమీద రకరకాలపనులు చేస్తవి. ఆమనిషి శరీరతత్వాన్ని బట్టి వుంటుంది. కొందరికి కూనురాగాలు పుడతవి, కొందరికి మీసాలపైకి చేతులు పోతవి, కొందరికి కళ్ళు చలించి దారి కనపడదు, కొందరికి పైత్యవికారం కలుగుతుంది.

మన్మథుడు మొత్తంమీద కొంటె ముండావాడు. పెద్దా పిన్నా తారతమ్యం అతగాడికి లేదు. బీదవాళ్లు భాగ్యవంతులూ అనే భేదం కూడా లేదు. కాకపోతే,

దేవుళ్ళగుళ్ళల్లోకి వెళ్ళే స్త్రీ పురుషులమీద బాణాలు వెయ్యడం ఏమి భావ్యంగా వుంది? ఒకచోట కొందరు స్త్రీ పురుషులు ప్రార్థనార్థమై చేరినారు. మన్మథుడు ఆయింట్లో ప్రవేశించి అందరిమీదా పువ్వులు చల్లి లేచి వచ్చినాడు. అప్పుడు ఒక్కొక్కరిలోనూ పుట్టిన చిత్తవృత్తులు ఏ మని చెప్పను!

ఒకచోట ఒకానొక విద్యార్థి పుస్తకం విప్పి చదువు కొంటున్నాడు. అతగానిమీద ఒక్క బాణం విసిరినాడు మారుడు. ఆవిద్యార్థి పాపం! బ్రహ్మచారి. తక్షణం అతగాడు ఇంటికి పరిగెత్తి పాతవార్తాపత్రికలు వెతికి వీర్య వృద్ధి ఔషధాలు వీ. పి. గా తెప్పించుకొన్నాడు.

ఇంకోచోట ముసలిభర్త, పడుచు పెండ్లామూ వుండడం చూసి, మన్మథుడాపడుచుమీద లక్షపూలు విసరినాడు. ముసలిభర్తమీద ఒక్కపూవైనా వెయ్యకుండా వెళ్ళిపోయినాడు. పాపం! ఆముసలివాడు పుత్రకాంక్షతో కాశీ రామేశ్వరాలు వెళ్ళివచ్చినాడట.

మన్మథుడి కొంటెతనం ఇలా వుంటుంది. ఇంకా ఎన్నో తమాషాలు చేశాడు.

ఈవిషయాలు భూలోకంలో ప్రకటించడానికి ఆయన దగ్గర అనుమతి పుచ్చుకొని తిరిగి వచ్చాను.

౧౯-౩౧